ఏసీబీకి చిక్కిన హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర-రణస్థలం: లావేరు మండలం వాల్తేపేట గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కిల్లారి కృష్ణకు తుది బిల్లు మంజూరు చేయడానికి హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మజ్జి కన్నంనాయుడు రూ.13వేలు లంచం డిమాండ్ చేయగా లబ్ధిదారుడు ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం లబ్ధిదారుడు లంచం సొమ్ము రూ.13వేలు తీసుకుని హౌసింగ్ కార్యాలయంలో వర్క్ ఇన్స్పెక్టర్ ఇస్తుండగా ఏసిబి అధికారులు రెడ్ హెండెడ్ గా పట్టుకున్నారు. డీఎస్పీ రమణమూర్తి, సిఐ రవి, భాస్కరరావు, ఎస్పై చిన్నంనాయుడు, శాంతారావు, కానిస్టేబుల్ అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

15న పాతపట్నం శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-పాతపట్నం : దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం పంచాయతీ శ్రీనీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం నందుగల ధర్మ హుండీలను దేవదాయ శాఖ అధికారులు, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, భక్తుల సమక్షములో ఈనెల 15, సోమవారం ఉదయం 10 గంటలకు తెరచి లెక్కించడం జరుగుతుందని కావున ఆసక్తిగల భక్తులు డ్రస్ కోడ్ పాటించి లెక్కింపునకు హాజరు కాగలరని శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం కార్య నిర్వహణాధికారి వి.వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర-సోంపేట : మందస ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సోంపేట మండలానికి సంబంధించి పలు చోట్ల అంగన్వాడీ పోస్టుల నియమాకానికి సిడిపిఓ వసుంధరాదేవి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మాకన్నపురం, జింకిభద్ర 1 కేంద్రాలకు అంగన్వాడీ వర్కర్ పోస్టులు, ఇసకలపాలెం 2, పలాసపురం2 కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు గాను నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన ధరఖాస్తులను ఈ నెల 19న సాయంత్రం 5గంటల్లోగా మందస ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు సూపర్‌వైజర్ లేదా మందస కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఐటిఐ ప్రవేశానికి ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-పలాస : ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలో ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనరు కె.శ్రీనివాసరావు, పలాస డా.కణితీస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన ధరఖాస్తులు వచ్చేనెల 6వ తేదీలోగా అందజేయాల్సి ఉంటుందని అన్నారు. ఐటిఐ.ఎపి. జివోవి.ఐఎన్ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐకు ఒక ధరఖాస్తు చేస్తే సరిపోతుందని అన్నారు. ధరఖాస్తులు చేసిన అనంతరం అభ్యర్థులకు దగ్గరల్లో గల ప్రైవేటు ఐటిఐలో మాత్రమే వారికి ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అన్నారు.

చిరంజీవికి మెరుగైన వైద్యం అందించండి

సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బారువకు చెందిన చిరంజీవి ఇటీవల మహేంద్రతనయ నదిలో పడి నీట మునిగి ప్రాణాపాయస్థితిలో బరంపురంలో గల ఎంకెసిజి ఆసుపత్రిలో చేరిన విషయంతెల్సిందే. ఈ నేపథ్యంలో సీడాప్ రాష్ట్ర చైర్మన్ ఎస్.శ్యాంప్రసాద్ రెడ్డి శుక్రవారం బరంపురం వెళ్లి ఎంకెసిజి ఆసుపత్రి వైద్యులను, బరంపురం ఎంపీతో కలిసి చిరంజీవికి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆసుపత్రి వర్గాలు స్పందించి తప్పకుండా చిరంజీవిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రాణాపాయం నుంచి గట్టెక్కిస్తామని చెప్పారు. చిరంజీవి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని శ్యాంప్రసాద్ పేర్కొన్నారు.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న సిరిపురం తేజేశ్వరరావు

విశాలాంధ్ర-పాతపట్నం: మండలం పెద్ద లోగిడి గ్రామానికి చెందిన దువ్వారి పరమేశ్వరరావు - పద్మావతి దంపతుల కుమార్తె త్రివేణి వివాహ మహోత్సవ కార్యక్రమంలో విద్యావేత్త పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు పాల్గొన్నారు. వీరితోపాటు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బారువ గ్రోయిన్ మరమ్మతులకు రూ.4.70లక్షలు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలంలో బారువ, పలాసపురం పంచాయతీలకు సాగునీరు అందించే బారువ గ్రోయిన్ తాత్కాలిక మరమ్మతులకు జిల్లాకలెక్టర్ 4.70లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిరియా సాయిరాజ్ తెలిపారు. గత తిత్లీ తుపాన్‌లో శిధిలమైన బారువ గ్రోయిన్ మరమ్మతులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికి సాంకేతిక కారణాలతో నిధులు మంజూరు కాలేదని తెలిపారు. అలాగే ఇటీవల ఇచ్ఛాపురం వద్ద కూలిపోయిన బాహుదావంతెన వద్ద బైపాస్ రోడ్డుకు 40లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో 20కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళంలో కలెక్టర్‌ను కలిసారు.

శాంతిభద్రతల పరిరక్షణే మా ప్రభుత్వ ప్రాధాన్యత : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-కొత్తూరు : రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షనే ప్రభుత్వం ప్రాధాన్యత గా ముందుకు సాగుతుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు శుక్రవారం కొత్తూరు లో 2.5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని స్పీకర్ తమ్మినేని స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతితో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 25 పోలీస్ స్టషన్‌లను ఆధునికీకరణలో భాగంగా ఒక్కోటి 2.5 లక్షల రూపాయిల వ్యయంతో నిర్మాణాలు సాగుతున్నాయి, అందులో భాగంగానే జిల్లాలో కొత్తూరు, మందస పోలీస్ స్టేషన్లకు నూతన భవనాల నిర్మాణం జరిగినది అని అన్నారు. ప్రజల సహాకరం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డిఐజి హరిక్రిష్ణ, జిల్లా ఎస్పీ రాధిక, ఎఎస్పీ విఠల్ స్వర్ రావు సీఐ వేణుగోపాల్ రావు, ఎస్. ఐ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పచ్చతోరణంతో అర్థికాభివృద్ధి

విశాలాంధ్ర-జలుమూరు : మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దళిత కులాల వారికి ఇందిరమ్మ పచ్చ తోరణం పథకం కింద మంజూరు చేసిన మామిడి, కొబ్బరి చెట్ల అభివృద్ధితో తమ బతుకులు ఆర్థికంగా కాస్త మెరుగుపడ్డాయని మండలం రాణా గ్రామానికి చెందిన లబ్ధిదారులు తెలిపారు. 2006, 2007 సంవత్సరంలో ఈ పథకంలో భాగంగా జలుమూరు మండలం చల్లవానిపేట రాణాతో పాటు పలు గ్రామాల్లో మంజూరు చేశారు. రాణా గ్రామంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి వంద మామిడి మొక్కలు చొప్పున అందజేశారు. ఇందులో ముగ్గురు లబ్ధిదారుల మొక్కలు నాశనం అవగా, ఉరిటి చిన్నమ్మడు 100 మొక్కల్లో 90 మొక్కలు బతికించుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఆ ప్రాంత ఆలయ ప్రతిష్టలో పాల్గొన్న శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్ వాటిని చూసి ఎంతో ఆనందపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ సంక్షేమం లబ్దిదారులు ఇలానే కాపాడుకుంటే ప్రతీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. లబ్దిదారులకు అభినందనలు తెలియజేశారు.

దళారుల చేతిలో 'జీడి' రైతులు

తక్కువ ధరకే 'పిక్కలు' కొంటున్న వ్యాపారులు

విశాలాంధ్ర-నరసన్నపేట : ఆరుగాలం కష్టపడే అన్నదాతల శ్రమ దళారుల దోపిడికి గురౌతుంది. రైతాంగం పండించే పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని చెపుతున్న వైసిపి ప్రభుత్వం మాటలు, కోటలు దాటుతున్నాయి గాని, ఆచరణలో అమలు కావటం లేదన్నది రైతుల వాదన. ప్రస్తుతం జిల్లాలో జీడి పిక్కలు పండించే రైతులు కొనుగోలుదారుల కోసం కళ్ళు కాయలు చేసి చూస్తున్నారు. పిక్కలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, దళారులు ముందుకు రాకపోవటంతో జీడి రైతులు పంట అమ్ముకునేందుకు గగ్గోలు పెడుతున్నారు. గత సంవత్సరం ఈ సమయానికి 80కిలోల జీడి పిక్కల బస్తా ధర రూ.10వేలు వుంటే, ప్రస్తుతం రూ.8వేలకు కొనుగోలు చేస్తామని దళారులు అంటున్నారు. అంతేకాక పలాస నుండి జీడి పిక్కలు కొనుగోలు చేసే వ్యాపారులు గ్రామాల్లోకి రాకపోవటంతో దళారులు తక్కువ ధరలకు పిక్కలు కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో నరసన్నపేట మండలంలో 1465ఎకరాలు జీడిమామిడి పంట సాగవుతొంది. అలాగే పోలాకి మండలంలో 1423ఎకరాల్లో, జలుమూరు మండలంలో 506ఎకరాల్లో, సారవకోట మండలంలో 1830ఎకరాల్లో మొత్తం 5,304ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. దీని ద్వారా సుమారు 15,000బస్తాల పిక్కలు దిగుబడి వస్తుందని రైతాంగం తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం జీడి పిక్కల పంటకు సంబంధించి మద్దతు ధర ప్రకటించకపోవటంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి జీడి పిక్కలకు మద్దతు ప్రకటించి, రైతాంగానికి సరైన గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని జీడి రైతులు కోరుతున్నారు.

లోకేష్ పాదశయాత్రకు సంఘీభావం : 15వ తేదీన సెమీ పాదయాత్ర

విశాలాంధ్ర-కొత్తూరు : గత వంద రోజులుగా తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సాగిస్తున్న యువగళం పాద యాత్రకు సంఘీభావంగా ఈనెల 15వ తేదీన మెట్టూరు నుండి మండల కేంద్రం కొత్తూరు వరకు సెమీ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పాతపట్నం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణ తెలిపారు శుక్రవారం సాయంకాలం ఇక్కడ తెలుగుదేశం కార్యాలయంలో ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ యువ గళం పాదయాత్ర విజయవంతంగా సాగుతుంది రాజకీయ చైతన్యం పెరిగింది. ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని కలమాట అన్నారు. జీవో 1 కోర్టు కొట్టేయ్యడం ప్రజాస్వామ్య విజయం. ప్రయపక్షాల గొంతు నొక్కడానికి భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించే వైసిపి ప్రభుత్వం తెచ్చిన జీవో 1ను రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కొట్టేయ్యడం పట్ల మాజీ ఎమ్మెల్యే కలమట హర్షం వ్యక్తం చేశారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలుచెయ్యలని చూసిన వైసీపీ ప్రభుత్వానికి హై కోర్టులో చుక్కేదురైంది అని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక చాట్టలు తెవొద్దు అని అన్నారు. ఈమీడియా సమావేశంలో టీడీపీ మండల కార్యదర్శి పి.మోహన్‌రావు ఆ పార్టీ నాయకులు కమలకర్, అచ్చుతరావు ఆగతము డి.అరుణకుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు రాకముందే ఉపాధి పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-సోంపేట : మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన ఉపాధి పనులు వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఆదేశించారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేయాలని అధికారులను సూచించారు. అవసరమైన వారికి కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను డాక్టర్ దాసు కోరారు. జగనన్న కాలనీలకు సంబంధించి ఇంకా అర్హులున్నట్లయితే 90 రోజుల ప్రోగ్రాంలో వారికి తప్పకుండా ఇళ్ల మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ వెంకటరమణ, జెడ్పీటిసి తడక యశోద, మాజీ ఎంపీపీ మంగి గణపతి, పిఏసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, ఏఎంసి చైర్మన్ బతకల మోహనరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై నాణ్యమైన మొక్కలు : ఏపీఎం గోవింద్

విశాలాంధ్ర-కవిటి : రైతులకు 50 శాతం రాయితీపై నాణ్యమైన మొక్కలు అందజేయడం జరుగుతుందని ఏపిఎం గోవింద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కవిటి కొత్తూరు ఎఫ్‌పిఓ కార్యాలయంలో ఎఫ్.పి.ఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎపిఎం గోవింద్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పిఓ) ద్వారా 50 శాతం రాయితీపై కొబ్బరి, మామిడి, జీడి, అరటి నాణ్యమైన మొక్కలు అందజేయడం జరుగుతుందని కావాల్సిన రైతులు కార్యాలయంలో నమోదు చేసుకుంటే మొక్కలు సకాలంలో అందజేస్తారని తెలిపారు. 50 శాతం రాయితీపై కావలసిన రైతులకు వర్మి కంపోస్ట్ అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రజిని, ఎఫ్.పి.ఓ అధ్యక్షుడు బి.జయప్రకాష్, రైతులు, ఎఫ్‌పిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రజలకు సేవా కేంద్రాలు : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-మందస : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సచివాల యాల వ్యవస్థ ప్రజలకు సేవా కేంద్రాలుగా పని చేస్తున్నాయని, ప్రభుత్వ సంకల్పాన్ని కార్యరూపం లోకి తేవడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం మండలం సొండిపూడి గ్రామంలో 25లక్షల రూపాయలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం సాధించినప్పుడు దేశానికి అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని జాతిపిత మహాత్మా గాంధీ అన్నారని, ఆయన కలలు కన్న గ్రామస్వరాజ్య సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విధానపరమైన నిర్ణయం తీసుకొని దేశంలో మరెక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 వరకు సేవలను ప్రజలకు అందిస్తున్నాయని, ప్రజల వద్దకు పాలనకు ఇది నిదర్శనమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం జీడి రైతుల కోసం ఉద్దాన రైతుల కోసం పట్టించుకోకపోవడం వలనే ఆ కుటుంబాన్ని ప్రజలు మూలన కూర్చోబెట్టారని, నేడు అదే గౌతు శివాజీ జీడి పిక్కల మద్దతు ధర కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి సచివాలయాల ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు వైసీపీలో చేరడంతో కండువాలు వేసి పార్టీలోకి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, ఎంపిడివో తిరుమలరావు, సొండిపూడి సర్పంచ్ నలినీ శ్రీనివాసరావు, మూలపేట సర్పంచ్ వెంకటరావు, ఎంపిటిసి డి.దమయంతి, మాజీ సర్పంచ్ గౌర హరిమహంతి, సార దుర్వాసులు, టి.గురుమూర్తి, పి.భీమారావు, నీలయ్య, నాగేశ్వరరావు, ప్రశాంత్, మల్లా రెడ్డి, జగన్, పి.శ్రీను, గురుమూర్తి, పుష్ప, వాణిశ్రీ, దుర్యోదన, క్రిష్ణ, కిరణ్‌లతో పాటు బూత్ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపైన అసెంబ్లీ స్థాయిలో ప్రజా చార్జ్‌షీట్

విశాలాంధ్ర-టెక్కలి : వైసిపి ప్రభుత్వ వైఫల్యాల పైన అసెంబ్లీ స్థాయిలో ప్రజా ప్రతినిధుల అవినీతి, అక్రమాలపై ప్రజా చార్జ్ షీట్ లో భాగంగా ప్రజా ఛార్జ్ షీట్ కార్యక్రమం టెక్కలి అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి నాయకులు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలలో వైసిపి ప్రభుత్వం అరాచక, అవినీతి, అక్రమాలపై చార్జ్ షీట్ దాఖలు కార్యక్రమం నిర్వహిస్తున్నామని,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు విచ్చేశారని టెక్కలి అసెంబ్లీ కన్వీనర్ అట్టాడ రవిబాబ్జి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను తుంగలో తొక్కి, ప్రభుత్వం ప్రారంభించన నాటి నుండి దాడులు, దందాలు, భూకబ్జాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి విధంగా ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించ డానికి ఈ యొక్క ప్రజా ఛార్జ్ షీట్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. టెక్కలి నియోజవర్గంలో పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుంచి అభియోగ పత్రాలు స్వీకరించి అనంతరం నాలుగు మండలాల నుంచి వచ్చిన అభియోగ పత్రాలను క్రోడీకరించి అసెంబ్లీ ప్రజా చార్జ్ షీట్ తయారుచేసిన అనంతరం టెక్కలి డి.ఎస్.పి కి ప్రజల తరపున ప్రభుత్వంపై ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, ఓ బి సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కామేశ్వర్ రెడ్డి, టెక్కలి మండల అధ్యక్షులు గూన మీనాకుమార్, కోటబొమ్మాళి మండల అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఓబీసీ మోర్చా కార్యదర్శి జగన్నాథం, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలాస ఆర్టీసీ సిబ్బంది ఔదార్యం... 50 తులాల బంగారం అప్పగింత

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: పలాస ఆర్టీసి డిపోకు చెందిన డ్రైవరు ఎన్.హెచ్.ప్రసాద్, ఆర్.వి.రావులు ఒక ప్రయాణీకురాలకు చెందిన 50 తులాల బంగారంతో పాటు లగేజీని వారికి అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. శుక్రవారం విశాఖపట్నం ఆర్టీసి కాంప్లెక్సులో పలాస డిపోకు చెందిన 30జెడ్0070 నెంబరు బస్సు పలాసకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఆ బస్సులో వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన ప్రయాణీకురాలు శోభారాణి తన లగేజిను బస్సులో ఉంచి డ్రైవరు, కండక్టర్‌కు చెప్పకుండా దిగిపోయారు. అందులో సుమారు 35 లక్షల రూపాయలు విలువ గల 50తులాల బంగారం, విలువైన బట్టలు ఉన్నాయి. ఇంతలో బస్సు పలాస వైపు బయలుదేరే సమయంలో ప్రయాణీకురాలు శోభారాణి విశాఖ కాంప్లెక్సులోనే ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న టెక్కలి డిపో కండక్టర్ ధనుంజయ పలాస డిపోకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. విధుల్లో ఉన్న కండక్టర్, డ్రైవరుకు లగేజీ విషయం తెలియజేయడంతో వారిద్దరు భద్రంగా లగేజీని డిపో మేనేజర్‌కు అందజేశారు. ఈ సమాచారాన్ని ప్రయాణీకురాలు శోభారాణికి తెలియజేయడంతో శుక్రవారం డిపోకు వచ్చిన ఆమెకు డిపో మేనేజర్ సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ గురుగుబల్లి రామ్మోహన్ సమక్షంలో అందజేశారు. పోయిన లగేజీ బ్యాగ్ దొరకడంతో శోభారాణి సంతోషం వ్యక్తం చేస్తూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు
- వైద్య అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కంటి వెలుగు శస్త్ర చికిత్సలకు సంబంధించిన నిర్వహణలో డేటా ఎంట్రీలో లోపాలు ఉన్నాయని అటువంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పోస్టులు ఖాళీ ఉండకుండా భర్తీ చేయాలని, మెడికల్ ఆఫీసర్ లేని పి.హెచ్.సిలకు ఇంచార్జ్ లను నియమించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి కి ఆదేశించారు. వైద్యాధికారులు ప్రతిరోజు విధిగా వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్.ఆర్.ఎస్. అటెండెన్స్ వేయాలన్నారు. క్రింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులకు సరిగా హాజరవ్వని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ స్థాయి నుండి మండల స్థాయి వరకు కుడా వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ, సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందే ప్రతీ సేవ, మరింత మెరుగ్గా పరిష్కారం చూపే విధంగా, మారుమూల గ్రామాల నుండి జిల్లా స్థాయి వరకు జిల్లా కలెక్టర్ నుండి గ్రామ వార్డు సచివాలయాల వరకు సమస్యలు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేసేందుకు, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి మంచి వేదిక అన్నారు. అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందకపోతే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రతి వినతి పరిష్కారం అయ్యే వరకూ ట్రాకింగ్ చేయబడుతుందని తెలిపారు. నాణ్యతతో కలిగిన పరిష్కారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ను జిల్లాలోని అన్ని మండలాల్లో సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయం వారీగా జన సంఖ్యను పరిగణలోకి తీసుకుని.. వయస్సు వారీగా వివిధ రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించాలన్నారు. ఏఎన్ఎం, ఆశ, సిహెచ్‌ఓ లతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేయాలని ఆదేశించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల సీజనల్ మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఓపి ల నమోదు సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. గ్రామాల్లో కమ్యూనల్ డిసీజెస్ కంట్రోల్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రోత్సహించడం, సుఖ ప్రసవాలు చేయడం, ప్రణాళికా ప్రకారం ఇమ్యునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతృ, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు, ఆరోగ్యశ్రీ పథకం అమలు, ఆయుష్మాన్ భారత్ అమలు తదితర ప్రక్రియలను చేపట్టడంలో ప్రతి ఒక్కరు మంచి పనితీరు కనబరచాలన్నారు. అనంతరం కలెక్టర్ పీ .హెచ్.సి స్థాయిలో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.బి. మీనాక్షి, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డా అనురాధ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, హర్బన్ మెడికల్ ఆఫీసర్ డా. జంపు కృషమోహన్, ఆరోగ్యశ్రీ కో - ఆర్డినేటర్ డా. ప్రకాష్, పీహెచ్ సీలు, యూపీహెచ్ సీలు, సీహెచ్సీలు తదితర ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు మైక్రో క్రెడిట్ రుణాలు : డి.సి.సి.బి. బ్యాంకు మేనేజర్ లావణ్య

విశాలాంధ్ర-ఆమదాలవలస : మండల పరిధిలోగల రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో సభ్యులైన, మహిళా రైతులందరకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం వ్యవసాయ అనుబంధ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన రుణాలను డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ద్వారా, సన్న కారు రైతు కుటుంబాలకు తక్కువ వడ్డీకే మంజూరు చేస్తున్నట్లు మేనేజర్ వి. లావణ్య వివరించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్యలో వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు ఆధ్వర్యంలో జరిగిన సిబ్బంది సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యులను గుర్తించి, వారి ఆదాయాభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన రుణాలకు దరఖాస్తు చేసు కోవచ్చు అన్నారు. ఏ.పి.ఎం. కూర్మా రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చిరు ధాన్యాలు రాగులు, జొన్నలు సామలు, కొర్రలు ,హారికలు ,నూనె గింజలు ,పప్పు దినుసులకు సంబంధించిన ఉత్పత్తి దారులను గుర్తించి వారిని ప్రోత్స హించా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, అకౌంటెంట్ కళ్యాణి, డేటాఎంట్రీ ఆపరేటర్ జగదీష్ తో సహా క్లస్టర్ కోఆర్డి నేటర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కలశ పూజ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కుసుంపురం గ్రామంలో హరేకృష్ణ హరేరామ మహామంత్ర నామ యజ్ఞంలో భాగంగా భక్తి శ్రద్ధలతో కలశ పూజ కార్యక్రమం గ్రామస్తు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాటి నుండి ఐదు రోజులపాటు నిర్వహించు హరేకృష్ణ హరేరామ మహామంత్ర నామ యజ్ఞం లో భాగంగా గ్రామ మహిలచే సముద్ర జలం (గంగాదేవీ ఆహ్వానం) తీసుకువచ్చి, కలశపూజ చేసి తిరువీధులు కలశ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడే జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా మే నెల రెండవ శనివారం 13వ తారీఖున దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో అన్ని కోర్టు లలో కూడా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని కావున ప్రజలందరూ ఈ అవకాశం సద్వినియోగపరచుకొని వారికి ఉన్న రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు మరియు అన్ని రకాల సివిల్ కేసులు ప్రీ లిటిగేషన్ కేసులు అన్నిటిని రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని శ్రీకాకుళం జిల్లా ప్రజలను జిల్లా జడ్జి కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్ అదాలత్ లో కేసు రాజి అయితే అపీలుకు అవకాశం లేనందున సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని లోక్ అదాలత్ లో కేసు రాజి అయినప్పుడు ఇరుపక్షాలకు గెలిపే ఉంటుందని సాధారణ కోర్టులో లాగా ఒకరు ఓటమి ఒకరు గెలుపు కాకుండా లోక్ అదాలత్ లో ఇరుపక్షాలకి గెలుపే ఉంటుందని సమాజంలో శాంతి సౌభ్రాతృత్వము రాజీ పడుట ద్వారా నెలకొల్పబడతాయని కావున ప్రజలందరూ ఈ లోక్ అదాలత్ వినియోగించుకొని వారి కేసులు పరిష్కరించుకొని ఈ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర- పాతపట్నం : మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన మజ్జి రామారావు, మజ్జి లక్ష్మీనారాయణ, మజ్జి జోగారావు, మజ్జి వెంకటరమణ, అనే నలుగురు వ్యక్తులు రిజిస్టర్డ్ డాక్ మెంట్ నెంబర్ 1774/2010 సం" లో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి కి చెందిన జయశ్రీ పాడి, సన్ ఆఫ్ ప్రసాద్ పాడి పర్లాకిమిడి అనే వ్యక్తులకు భూమిని విక్రయించారు. ఫేక్ డాక్యుమెంట్లు చూపించి లేని భూమిని ఉన్నట్లుగా చూపించి రిజిస్ట్రేషన్ చేయించారు. వాస్తవానికి అక్కడ భూమి లేదని ఎవరైతే ముగ్గురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు మరియు నాలుగో వ్యక్తి గవర్నమెంటు టీచర్ మజ్జి వెంకటరమణ వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు వీరిపై కేసు రిజిస్ట్రేషన్ చేస్తామని, సంబంధిత ఎండిఓ, డిఈఓ కి తెలియ చేస్తామని ఎంక్వైరీ చేసి తప్పు చేశారని తేలితే చీటింగ్ కేసు నమోదు చేస్తామని గతం లో కూడా మూడు కంప్లైంట్ వీరిపై వచ్చాయని మోసం చేసి స్థలం విక్రయించడం తప్పని పాతపట్నం ఎస్ఐ ఎన్. కామేశ్వరరావు మీడియాకి తెలియచేశారు.

చిరస్మరణీయం చిన్ననాటి స్నేహం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జీవితంలో ఎవ్వరు ఉన్నా... లేకున్నా..... ఒక్క మంచి స్నేహితుడుంటే చాలు అనుకునే వారందరికీ ఆదర్శంగా చిన్న నాటి మిత్రుల బృంధం ఆత్మీయ కలయిక శుక్రవారం జరిగింది. స్థానిక ఏ.యు.పి పాఠశాలలో విద్యారంభం, సురంగి రాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరిన్ని విద్యాబుద్దులు నేర్చుకుని, వివిధ వృత్తుల్లో స్థిరపడిన స్నేహితులు అంతా ఒక్కచోట చేరి సందడి చేసుకుని, ఆ పాత మధురాలు నెమరువేసుకుంటూ జీవిత అనుభవాలు పరస్పరం పంచుకున్నారు. పుట్టి పెరిగిన గడ్డ పై దాదాపు 30 ఏళ్ల తరువాత, స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. విదేశాల్లో ఉన్న వారు సైతం వచ్చి తమ బాల్య మిత్రులను గుర్తించి ఆలింగనం చేసుకుని స్మృతులను తెలుపుకున్నారు. ఈ స్నేహం చిరస్మరణీయమని, ఇది ఇలాగే కొనసాగిద్దామని అభిప్రాయాలు వ్యక్తం చేసారు. ప్రాథమిక విద్య తర్వాత కొందరు దూరమయ్యారని, 1995లో ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత మరికొందరు మిత్రులు ఇతర ప్రాంతాలకు వెళ్ళినా చిన్న నాటి స్నేహితులు ఒక్కచోట కలవడంతో ఉద్విఘ్నతకు లోనైనట్లు పలువురు తెలిపారు. మిగతా మిత్రులను కూడా త్వరలోనే కలుసుకోవడం, కుటుంభాలతో సహా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం, గురువులను సన్మానించటం, మరీ ముఖ్యంగా ఒకరికి ఒకరుగా అన్ని సందర్భాలలో తోడుగా ఉంటూ... అవసరం మేరకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి ఆదుకునే సంకల్పంతో ఆర్థిక నిధి ఏర్పాటు అంశాలను ఆమోదించుకున్నారు. వివిధ సందర్భాలలో బాల్య మిత్రులు పి.కిషోర్, కటారి మోహనరావు, బల్లా నానిలను కోల్పోవటం పట్ల విచారాన్ని వ్యక్తం చేసి, వారిని స్మరించుకుని వారి ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. సదాశివుని శ్రీనివాస్, డాక్టర్ పాతిర్ల దేవేంద్ర, డాక్టర్ నందిక శ్రీనివాస్, మల్లా నాగేశ్వర రావు, బత్తిన నాగరాజ్, ఎస్. శ్రీహరి, నాగరాజ్ పాత్రో, పిలక కళ్యాణ్, ప్రభాకర్ బెహరా, గుజ్జు జగన్నాథ్, బోయిన తిరుమల రావు, వి.ఆదినారాయణ, ఆశి సతీష్ కుమార్, దద్ద జయరామ్, కుప్పిలి భువనేశ్వర్ రావు, కొవ్వాడ మోహన్ రావు, జోగేష్, గోపిదొళై మోహన్, కాళ్ళ కుమార్, కుండల సురేష్, ఎం. ముకుంద రావు, కె. రాంజీ, నర్తు యాదవ్ రావు, తండా కామేష్, సాడి ఢిల్లీ రావు, కాళ్ళ గంగ రాజు, పత్రి జగన్, వి. సత్యన్నారాయణ తదితరులు రోజంతా ఉల్లాసంగా ఉత్సహభరితంగా గడుపుకున్నారు.

రీసర్వే పనులను సబ్ కలెక్టర్ పరిశీలన



విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలంలో గల చీపుర్లపాడు సచివాలయం పరిదిలో గల చీపుర్లపాడు, కన్నేవలస పంచాయతీలలో జరుగుతున్న భూరీసర్వే పనులను టెక్కలి సబ్ కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. రీసర్వే పూర్తి అయిన రైతులకు భూమి యొక్క పాస్‌పుస్తకాలకు రైతులు నుంచి తంబలు ఎందుకు ఇంకా వేయించలేదని సంబందిత వీఆర్వో జబీనను అయన ప్రశ్నించారు. భూసర్వేను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. అలాగే కన్నేవలస పంచాయతీలో జరుగుతున్న భూసర్వేలో భూముల్లో వేస్తున్న హద్దురాళ్ళను పరిశీలించారు. అలాగే చీపుర్లపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిదిలావస్థకు చేరుకోవడంతో పాఠశాలను పరిశీలించారు. ఈ పాఠశాలకు నాడునేడు ద్వారా ఎందుకు మరమ్మత్తు పనులు చేయటం లేదని అధికారులకు ప్రశ్నింగా ఎవరు ముందుకు రావటం లేదని అదికారులు తెలిపారు. పాఠశాల ప్రారంభం నాటికి మరమ్మత్తులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాసీల్దార్ ఆర్. మధు, పంచాయతీ కార్యదర్శి బి.నరేష్, సచివాలయ అధికారులు కుటికుప్పల ముకుందరావు, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీసీ హోంను సీడబ్ల్యుసీ సభ్యులు తనిఖీ

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక గోఖలే శిశు సదనం(జిసిహెరామ్)ను శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. సిడబ్ల్యుసి అధ్యక్షురాలు, యు.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో విద్యార్థులకు లభిస్తున్న వసతి, క్రీడలు, వినోదం వంటి విభిన్న సౌకర్యాలపై చర్చించి, తగు సూచనలు ఇచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్ సెంటర్ ఆదేశాల మేరకు మాసిక్ తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. నరసన్నపేట గోఖలే శిశు సదనంలో విద్యార్థులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి చెందినట్లు శ్రీలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో జిసి హెరామ్ లోకల్ కమిటీ ఛైర్మన్, సదాశివుని కృష్ణ, హెరామ్ వార్డెన్, రవీంద్రనాథ్ సాహుతో పాటు సిడబ్ల్యుసి సభ్యులు, వి.రమణమూర్తి, ఎం. గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందించే వరి విత్తనాలనే రైతులు పండించాలి

జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించే వరి విత్తనాలనే రైతులు పండించాలని ఎమ్మెల్యే, జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగానికి సబ్సిడీపై అందించే వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేసి, ఆర్బికేల ద్వారా అమ్మకాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి ప్రతినిధులు, చింతు రామారావు, రాజాపు అప్పన్న, వ్యవసాయశాఖ ఏడి, కె.రవీంద్రభారతి, ఏవో, కె.సునీత, ఎస్.ఐ, వై.సింహాచలం వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం టెక్కలి పాడులో కొత్తగా నిర్మించిన సీతారామాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పురోహితుడు వనమాలి ప్రభాకర శర్మ, వనమాలి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 12న గణపతిపూజ, పుణ్యాహవచనం, శ్రీసీతారాముల విగ్రహ ప్రాణప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

సెగలు..!



- ఉదయం ఉక్కపోత.. రాత్రిళ్లు వేడి సెగలు...!
- రోజురోజుకు భానుడి ఉగ్రరూపం
- గడపదాటాలంటే భయపడే పరిస్థితి
- ఎండలకు తట్టుకోలేక అల్లాడిపోతున్న జనం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: భానుడి ప్రతాపానికి జనం బెంబేత్తిపోతున్నారు. వడగాల్పులకు విలవిలాడుతున్నారు. మోచో తుఫాన్‌తో ఎండలు మండిపోతున్నాయి. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంది. పగటి వేళ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత మూడు రోజులు నుంచి ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. ఎండలు క్రమక్రమంగా పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 7 నుంచే వేసవి తాపం మొదలవుతున్నది. ఇక మధ్యాహ్నమైతే చాలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. బానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణికర్తెరాకముందే ఎండలతో ప్రజలు భయపడిపోతున్నారు. జిల్లాలో రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తర్వాత ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. జనాలు వేసవి తాపానికి తట్టుకోలేక పోతున్నారు. గత యేదాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. ఇదిలా ఉండగా ఎండ తీవ్రత ఎంత ఉన్న రోజువారి పనులు చేసుకునే కూలీల పరిస్థితి దారుణంగా మారింది ముఖ్యంగా ఉపాధిహామీ కూలీలు ఎండలు దంచికొడుతున్నా పని మానే పరిస్థితి లేదు. వీరితో పాటు మధ్యాహ్నం సమయాల్లో బయటకు వచ్చిన వారు వడదెబ్బకు గురవుతున్నారు.

రాత్రిళ్లు ఉక్కపోతతో ఇబ్బందులు : ఉదయం ఎండలు దంచి కొడుతుంటే రాత్రిళ్ళు వేడి సెగలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాత్రి సమయాల్లోనూ ఉష్ణోగ్రత 34 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో చిన్నారులు, వృద్దులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రయాధం ఉంది. ఒక్కో సారి ప్రాణాలకు ముప్పు కూడా ఏర్పడుతుంది. అలాగే ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కనుక వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జగన్‌రెడ్డి నేరాలని కప్పిపుచ్చే కుట్రే జీవో నెం.1

విశాలాంధ్ర-టెక్కలి : జగన్ రెడ్డి దోపిడీలు, మోసాలు, నేరాల్ని కప్పిపుచ్చే కుట్ర జీవో నెం.1 అని టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్.1జారీ చేశారంటే జగన్ రెడ్డికి ప్రజాస్వామ్యం పైన ప్రజల పైన నమ్మకం లేదని రుజువు అవుతున్నదని,స్టేట్ టెర్రరిజం అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని,రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని కుప్పం ఎమ్మెల్యేగా ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబు నాయుడు పర్యటనలను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని దిక్కరించడమే అని అన్నారు.జగన్ రెడ్డి హిట్లర్, ముస్సోలిని, బ్రిటిష్ వారి నిరంకుసత్వ పాలనను మరిపించేలా పాలన కొనసాగిస్తున్నారని చంద్రబాబు,లోకేష్,పవన్ కళ్యాణ్ రోడ్ షోలకు బందోబస్తు కల్పించాల్సిన బాధ్యత చట్టప్రకారం జగన్ రెడ్డి ప్రభుత్వం పై ఉన్నదని జగన్ రెడ్డి తల్లి,చెల్లి,తండ్రి పాదయాత్రలకు చంద్రబాబు ప్రభుత్వం భద్రత కల్పించిందన్నారు. ఈకార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ,మామిడి రాము,మల్ల బాలకృష్ణ,కోళ్ల కామేష్, రేయ్యి ప్రతీష్ చంద్ర, దల్లి ప్రసాద్ రెడ్డి, బుడంకాయల అభిలాష్,సోడిముడి శివకిరణ్, ప్రఫుల్లా పోరీడా, తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

16న పలాస మండల సమావేశం

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 16 మంగళవారం ఉదయం 10.30గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో రమేష్‌నాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మండలాధ్యక్షురాలు ఉంగ ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నామని, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి : బిజెపి పట్టణ అధ్యక్షులు పాలవలస



విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కొర్రాయి బాలక్రిష్ణ, పట్టణ బిజెపి అధ్యక్షులు వైకుంఠరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస నియోజక వర్గంలో ప్రజలు ఇచ్చిన అభియోగపత్రాలపై చార్జిషీట్ దాఖలు చేయాలని కోరుతూ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో కాలువల వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, రోడ్ల పరిస్థితి అధ్వాన్నస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదని అన్నారు. మున్సిపాలిటీలో మంచినీటి సమస్య అధికంగా ఉందని, ప్రజల దాహార్తీని తీర్చేందుకు చర్యలు శూన్యమని అన్నారు. 2014లో కాశీబుగ్గ రైల్వే గేటుపై ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి ఇప్పటి వరకు కొనసాగుతునే ఉందని, ఈ సమస్య ఎప్పుడు తీరుతుందోనని అన్నారు. జగన్నాథసాగర్ నుంచి వంశధార నీరు వజ్రపుకొత్తూరు మండల శివారు భూములకు దేశబట్టి ద్వారా వెళ్తుందని, దేశబట్టి మరమ్మతులు చేయకపోవడంతో రైతులకు సాగునీరు అందక పంటలు పండడం లేదని అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనుల కోసం పునాది రాయి వేసి దశాబ్దాలు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదని, ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను దారి మళ్లీస్తున్నారని, రివర్సు టెండర్లుతోడు ప్రభుత్వ పాలన ప్రారంభించి దాడులు, దందాలు, భూ కబ్జాలు చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి తీరా అధికారంలోకి వచ్చాక ఆ మాట మర్చిపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు మోహనరాజు, ప్రధాన కార్యదర్శి హనుమంతు రామారావు, దువ్వాడ రామారావు, కె.గోపి, రాజారావు, పాపారావు, మీల జోగారావు, కె.కామరాజు, చింతాల లోకనాధంలు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాచరణపై సమీక్ష

విశాలాంధ్ర-సోంపేట : మండలానికి సంబంధించి రానున్న ఖరీఫ్ కోసం కార్యాచరణ ప్రణాళికను మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. వ్యవసాయ సలహామండలితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి చర్చించారు. 2023 వైఎస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్ జాబితాలు, సామాజిక తనిఖీ, రాయితీపై పచ్చిరొట్ట వరివిత్తనాలు, యంత్రసేవా పథకంపై చర్చించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటిసి తడక యశోద, తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ బి.వి.రమణ, వ్యవసాయాధికారి నర్సింహమూర్తి, ఇరిగేషన్ అధికారి సూర్యప్రకాష్, ఉపాధిహామీ అధికారి ప్రమీల, మాజీ ఎంపీపీ మంగి గణపతి, పశువైద్యాధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలకు శుభరాట

విశాలాంధ్ర-మందస : మందస గ్రామదేవత అన్నపూర్ణమ్మ సంబరాల్లో భాగంగా శుక్రవారం దేవరవీధిలో శుభరాట కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు హాజరయ్యే శుభరాట ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామదేవత కోసం ప్రత్యేక పర్ణశాల నిర్మాణానికి పోతురాజుకు పూజలు నిర్వహించారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

పర్యాటక అభివృద్ధితోనే జిల్లా ఆర్థికాభివృద్ధి సాధ్యం

శ్రీకాకుళం జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లాలో ఎన్నో ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో కృషి చేస్తున్నా మని, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణ రావు శుక్రవారం జరిగిన పర్యాటక కౌన్సిల్ సమావేశంలో అన్నారు. ఇప్పటికి 17 యువ పర్యాటక క్లబ్బులు స్థాపించామని, వేసవి సెలవుల రువాత మరిన్ని యువ క్లబ్బులు నెలకొల్పుతామని అన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం యువ క్లబ్బుల స్థాపనలో రాష్ట్రంలో మొదటి స్థానంలో, భారత దేశంలో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. కౌన్సిల్ సమావేశ సారాంశాన్ని కలెక్టర్‌కి త్వరలో తెలియపరుస్తామన్నారు. టూరిజం కౌన్సిల్ మెంబెర్ డా. యార్లగడ్డ గీతాశ్రీకాంత్ మాట్లా డుతూ భారత దేశంలో పర్యాటక రంగం అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతోంది. పర్యాటక రంగం వలన వ్యాపారాభివృద్ధి జరిగి ఆయా ప్రాంతాలు, ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూరుతాయని, అలాగే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కౌన్సిల్ సభ్యులు వావిలాపల్లి జగన్నాథం నాయుడు మాట్లాడుతూ యువ క్లబ్బుల నిర్వహణ సిబిఎస్ఈ వారు రూపొందించిన మార్గదర్శకాలను ఇంటాక్ ద్వారా క్లబ్బులకు అందించి శిక్షణను ఇస్తా మన్నారు. డా.అరవింద్, డా.వినోద్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక చికిత్స, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహార ప్రాధాన్యతపైన శిక్షణ శిబిరాలు నిర్వహించాలి అన్నారు. నాగావళి ఆనంద్, సువ్వారి సతీష్ మాట్లాడుతూ ఈయువ క్లబ్ ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ప్రయోజనం ఉంటుందని ముఖ్యముగా తమ జిల్లా పర్యాటక వైభవాన్ని వారు తెలుసుకొని ప్రచారం చేస్తారన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

పలాస సి.హెచ్.సి సూపరిటెండెంట్ డా.మేఘున

విశాలాంధ్ర-పలాస : రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పలాస ప్రభుత్వాసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ మేఘన అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన వారికి అత్యవసరంగా రక్తం కావాల్సి ఉంటుందని, అనుకున్న సమయానికి రక్తం లభిస్తే వారి ప్రాణాలను కాపాడవారిమవుతామని అన్నారు. రక్తదానంపై కొంతమందికి అపోహాలున్నాయని, రక్తం దానం చేసినంత మాత్రాన ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ సందర్భంగా సామాజికవేత్త ఉపాధ్యాయులు ప్రాన్సిస్ రక్తదానం చేయడంతో పాటు తన అవయవాలను కూడా దానం చేశారు. ఆయనకు డాక్టర్ మేఘన ధృవీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ దబ్బీరు భవానీ, సురేష్‌కుమార్‌లతో పాటు నర్సులు పాల్గొన్నారు.

వైస్సార్సీపీ మండలాధ్యక్షులు ఆర్‌కేకు పితృవియోగం

విశాలాంధ్ర-హిరమండలం: మండలం వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ తండ్రి, మీసాల రామారావు శుక్రవారం సాయింత్రం 4 గంటలకు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో మరణించారు, మృతుడు మీసాల రామారావు వంశధార కార్యాలయంలో ఉద్యోగం చేసి ఉద్యోగవిరమణ పొందారు, చాలాకాలం అనారోగ్యంతో బాధపడుచు శుక్రవారం మృతి చెందారు, ఈయన మృతిపట్ల నాయకులు కార్యకర్తలు, ప్రజలు, మీడియా మిత్రులు, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, వార్డు మెంబెర్ లు, పలువురు సంతాపం తెలియ జేశారు,, మీసాల రామకృష్ణ మండలప్రజా నీకానికి మంచి సేవలు అందజేస్తున్నారు.

14న జరగబోయే హనుమాన్ శోభాయాత్రలో అందరూ పాల్గొనాలి

విశాలాంధ్ర-అరసవల్లి : నగరంలోగల దుర్గా ట్రాఫిక్ జామ్ ఫంక్షన్ హాల్‌లో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ హనుమాన్ శోభాయాత్ర పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు మాట్లాడుతూ ఈనె 14, ఆదివారం సాయంత్రం 3:00 గంటలకు హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర చేయనున్నామని తెలియజేశారు. శోభాయాత్ర ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్ నుండి ప్రారంభమై జిటి రోడ్డు మీదుగా వివేకానంద జంక్షన్ మహిళా కళాశాల అరసవిల్లి జంక్షన్ పాత బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్ కి చేరుకుంటుందని తెలియజేశారు. ఈపాదయాత్రలో ప్రముఖ స్వామీజీలు కోలాట బృందాలు భజన బృందాలు హనుమాన్ చాలీసా పారాయణ సాంస్కృతిక నాట్యాలుతో అధిక సంఖ్యలో మహిళలు, యువత అందరితో శోభాయమానంగా హనుమాన్ శోభాయాత్ర పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రలో నగర పరిధిలో ఉన్న వారే కాకుండా పరిసర ప్రాంతాల్లో ఉన్న హిందూ బంధువులు అందరూ యువతి యువకులు మహిళలు పురుషులు పెద్దలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ సాలక్ పారనంది వెంకటరమణ మూర్తి, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు లోకనాథం ఆనంద్, కోశాధికారి ధర్మవరపు ఆచారి, అయ్యప్ప సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షులు హెూటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శ్రీ వేణుగోపాల భక్తి స్వరాంజలి గ్రూప్ గౌరవ అధ్యక్షులు బస్వా శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ జామ్ శ్రీను గురుస్వామి, జిల్లా సహ మఠమందిర్ ప్రముఖ్ మెట్ట ధనుంజయ సాప్తహిక్ మిలన్ ప్రముఖ్, ఆశి ఉమామహేశ్వర రెడ్డి, సురక్ష ప్రముఖ కొయ్యాన కిరణకుమార్, ఛలోపాసనా ప్రముఖ బరాటం సంతోష్, గార మండలం కార్యదర్శి ఆనంద్ కాశ్యప్, ఎస్ఎస్ఎఫ్ సబ్ డివిజన్ కన్వీనర్ లోడ్డు క్రిష్ణారాజు, బగ్గ తరుణ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ప్రాజెక్టు నాల్గో యూనిట్ మరమ్మత్తు పనులు వేగవంతం

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు జెన్‌కో ప్రాజెక్టులో నాలుగో యూనిట్ మరమ్మత్తు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులను చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ యూనిట్‌లో 20 రోజుల క్రితం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు జెన్‌కో ఇంజనీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించారు. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కంపెనీకి పనులను అప్పగించినట్టు చీఫ్ ఇంజనీర్ తెలిపారు. ఇందుకోసం రూ.22లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని, కాగా సీలేరులో మూడు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. డొంకరాయిలో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ఉత్పత్తి నిలిపివేశామని చెప్పారు.

వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి : ఏవో రమేష్‌నాయుడు

విశాలాంధ్ర రాజవొమ్మంగి : మండలంలోని వరి విత్తనాలు అవసరమయ్యే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు తెలిపారు,కాగ మండలానికి 12 వందల క్వింటాల్ వరి విత్తనాలు రైతులకు అవసరమని గుర్తించి ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు,ఎం.టి యు 10 64-1012.8, ఎం టి యు11 21-124.7,ఎం టి యు1318-19.8,ఎన్ ఎల్ ఆర్34449-42.7 క్వింటాళ్ళు ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు,ప్రస్తుతం 400 క్వింటాళ్ళు ఎం టి యు1064 వరివిత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు,విత్తన మొలక శాతం పరిశీలించిన తర్వాత వంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎం టి యు 1064బ్యాగ్30కేజీ లు ధర 1143, ఒక కేజీ38.10కాగా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఏ వో రమేష్ నాయుడు కోరారు.

ఎందుకు గెలిచాము దేవుడా..!

ఆర్థిక ఇబ్బందుల్లో పల్లె పెద్దలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పంచాయతీ సర్పంచులే ప్రథమ పౌరులు. ఒకప్పుడు పల్లెల్లో వారంటే ప్రజలు ఎనలేని గౌరవ మర్యాదలిచ్చేవారు. గద్దెనెక్కిన వారు కూడా గ్రామాల అభివృద్ధి కోసం.. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. పల్లె పదవుల్లోనూ రాజకీయం రంగ ప్రవేశం చేసింది. పెద్దలుగా చెలామణి కావడాన్ని కొందరు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. పోటాపోటీగా హామీలు గుప్పిస్తున్నారు. ఓటర్లకు పంచేందుకు అప్పులు తెచ్చి ఖర్చు చేస్తున్నారు. ఆపై అప్పుల ఊబిలోకి కూరుకుపోయి వాటిని తీర్చేదారి కనిపించక మానసిక ఆందోళనపడు తున్నారు. జిల్లాలోని పలు పంచాయతీల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ గ్రంథాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన నూతన భవన నిర్మా ణాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించినప్పటికీ బిల్లుల చెల్లింపు సక్రమంగా ఉండటం లేదు. పనులు చేసిన వారిలో ఎక్కువ మంది బాధితులు అధికార పార్టీకి చెందిన సర్పంచులతో పాటు స్థానిక నాయకులే కావడం గమనార్హం.

అప్పులు తెచ్చి, ఎన్నికల్లో గెలిచి..: కోటబొమ్మాళి మండలంలో అధ్వాన పారిశుద్ధం.. గుంతలు పడిన రహదారులు. అస్త వ్యస్తంగా మురుగు కాలువలు.. తాగునీటి వెతలు, వెలగని వీధిదీపాలు.. ఇలా పల్లెల్లో సమస్యలు కోకొల్లలు. వీటన్నింటినీ పరిష్కరిస్తాం. పల్లె అభివృద్ధిని పట్టాలెక్కిస్తామంటూ 2021 ఫిబ్రవరిలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు హామీలు గుప్పించారు. కొన్ని చోట్ల గెలుపును ప్రతిష్టా త్మకంగా తీసుకున్నారు నాయకులు.

విడుదల కాని నిధులు : పంచాయితీలు రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చు చేసిన ఉదంతాలున్నాయి. ఆ తర్వాత బిల్లులు వస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన కొన్ని పనులకు లక్షలాది రూపాయల నిధులు ఖర్చు చేశారు. అందుకు కొందరు సర్పంచులు నెలకు రూ.2 నుంచి రూ.3 వడ్డీ చొప్పున అప్పులు తెచ్చారు. ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగి అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు. అప్పులిచ్చిన వారికి సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు. ఎందుకు ఎన్నికయ్యామురా దేవుడా అంటూ మదన పడు తున్నారు. మరికొందరికి ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు తలెత్తుతున్నాయి. మరోపక్క సార్వత్రిక ఎన్ని కలు సమీపించడంతో బిల్లులు రాకుంటే ఏమి చేయాలని, మానసిక ఆందోళనలో సర్పంచులున్నారు.

అటు మళ్లింపులు.. ఇటు ఆంక్షలు: ఇతర అభివృద్ధి పనులకు సంబందించి పెద్ద మొత్తానికి బిల్లు పెడితే జమ కావడం లేదు. చిన్నపాటి పనికి కూడా ఖాతాల్లో పైసలు లేక పరిస్థితి. తయారైంది. మరోపక్క పల్లెల్లో ఎలాంటి పనులు చేపట్టలేకపోయామని సర్పంచులు వాపోతున్నారు. అదేసమయంలో దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న విద్యుత్తు బిల్లులను సైతం పాలకవర్గాలతో సంబంధం లేకుండా ఇప్పటికే విడతల వారీగా జమ చేసుకున్నారు. ఇంకా విద్యుత్తు బకాయిలు ఉండటంతో ఇంటి పన్నుల రూపంలో వచ్చిన సాధారణ నిధు లను కూడా జమ చేయాలని ఒత్తిడి ఉంది. పల్లె ఖాతాలు ఖాళీ కావడంతో కొన్నిచోట్ల పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి.

నర్సుల సేవలు వర్ణించలేనివి : అరుకు ఎమ్మెల్యే

విశాలాంధ్ర హుకుంపేట : సమాజానికి వైద్యరంగంలో నర్స్ చేస్తున్న సేవను వర్ణించలేనిదని, నర్సు చేస్తున్న సేవ చాలా గొప్పదని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రాంలో ఆయన పర్యటించారు. అంతర్జాతీయ నర్స దినోత్సం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఎమ్మెల్యే సందర్శించి నర్స్‌లకు పుష్ప గుచ్చం అందించి సాలువలతో సత్కారించారు. నర్సులు చేస్తున్న సేవను కొనియాడుతు వారిని అభినందిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తల్లి కంటే ముందు బిడ్డను చూసేది నర్స్ మాత్రమేనని, దేవుడిలాంటి వైద్యుల తరువాత నర్స్.మాత్రమేనన్నారు. నర్సులు ముందుముందుకు మంచి సేవలు అందించి మానవత్వం చాటుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యా విభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు సామ్యేల్, జిల్లా వ్యవసా యసలహామండలి సభ్యుడు ఎం విశ్వే శ్వరరావు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కే రామకృష్ణ,మార్కెట్ వైస్ చైర్మెన్ సివేరి కొండలరావు, ఎంపిటీ సీల పోరం అధ్యక్షుడు మజ్జి హరి, తీగలవలసి ఎంపిటిసి కొర్ర నాగరా జు సోషల్ మీడియా కో-కన్వీనర్ కే కోటిబాబు, వైఎస్ఆర్ సిపి నాయకులు వైద్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికే అధిక ప్రాధాన్యం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మేజర్ పంచాయతీలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పంచాయతీలో పలు చోట్ల పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు. పారిశుధ్యానికి సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.